# మనసులు

అంగర వెంకట శివ ప్రసాద రావు



మెయిన్ రోడ్డు చాలా రద్దీగావుంది.

చాలా రకాల మనుషులు కనిపిస్తున్నారు. మనిషికీ మనిషికీ మార్పు కనిపిస్తోంది. రకరకాల రంగు రంగుల మనస్తత్వాలు కలిగుంటారీ మనుషులు. కడుపులో ఆకలి దంచేస్తూంది. మనుషుల వేదాంతం కట్టిపెట్టి హోటళ్ళ వేటాంతంలో పడ్డాన్నేను. దగ్గర్లో హోటలు కనిపించక పోయేసరికి పిచ్చెక్కినట్లనిపించింది. గబగబా నాలుగు అడుగులు వేసి "విజయా కేఫ్" లో కెళ్ళాను. అక్కడ కూడా రద్దీగానే వుంది. గుమ్మంలోంచే ఉన్న టేబుల్సన్నీ కలయ జూసాను, ఎక్కడేనా ఖాళీ దొరుకు తుందేమో అని. ఒకచోట సింగిల్ ఛైర్ ఖాళీగా కనిపించింది. ఫరవాలేదు నేను సింగిల్ మాన్ నే.... డబలిడ్లీనికాను, అను కుంటూ ఆ కుర్చీ నాక్రమించాను. సర్వర్ కోసం తపసు మొదలుపెట్టాను, కరుణించాడు. వెంటనే డబలిడ్లీ సాంబారన్నాను. అంటూ తలెత్తాను. ఎదురుగా వున్న డబలిడ్లీగాడు నావేపు వురిమి చూసాడు. నా ప్రక్క కుర్చీవేపు మొహం తిప్పాను. కాలేజీ స్టూడెంటులా కనిపించే చదువు్రలావు కని

పించాడు. మిగిలి పోయిన కుర్చీ వేపు చూసాను. అంటే డబలిడ్లీ ప్రక్కకుర్చీ... పాపం డబులిడ్లీ ధాటికి తట్టుకోలేక వొదిగి కూర్చున్నాడు.

ఇంతలో సర్వారావు యిడ్లీ తేవడంతో వాటి వేపు చూసాను. తింటున్నా వో చెవి టేబుల్ మీద పారేశాను. సర్వారావు వొదిగి వున్న మనిషిని ఏం కావాలని అడిగాడు.

"మంచీ ల" న్నాడు వాడు.

అదేమిటో ఆవేళ స్పెషల్ అను కున్నాను. సర్వారావు మంచి నీళ్ళ గ్లాసు తెచ్చి వాడి దగ్గర పెట్టాడు. తెచ్చిన గ్లాసుడు నీళ్లూ గడగడా తాగేసాడు వాడు. నేను తెల్లబోయాను మంచినీళ్లా వీడడిగింది! అప్పటికే డబలిడ్లీ వుల్లిపెసరట్ ఖాళీచేసి మసాలాదోశ ఆర్డరు చేసాడు. సర్వర్ మళ్ళీ ఆవొదిగి వున్న ఆసామిని ఏం కావాలన్నాడు.

"ఏం వొద్దుగురూ. " అన్నాడు వాడు.

ఆ మాటనే సరికి వాడివేపు చూసాను. అంత వరకూ వాడ్ని పరీక్షగా చూడలేదు. వాడి దగ్గర డబ్బులు తప్ప అన్నీ ఉన్నాయి. అన్నీ అంటే కావలసినన్ని చిరుగుల చొక్కా ..మాసి పోయిన గెడ్డం ... క్షవరం లేనితల.... మొదలగునవి.

ఇడ్లీ తినడం పూర్తిచేసి రవ దోశకి ఆర్డరు చేసాను. అప్పటికే వాడి వేపు రెండు సార్లు గుచ్చి గుచ్చి చూసాను. వాడూ దిక్కులు చూస్తున్నాడు. పోనీ వాడికో రెండిడ్లీ యిప్పిస్తే ...ఆకలితో వున్నట్లున్నాడు. అని అనుకున్నాను. వాడి ప్రక్కన కూర్చున్న డబలిడ్లీగాడు కానీ, నా ప్రక్కన కూర్చున్న చదువుల్రావుగానీ యివేమీ పట్టించుకున్నట్లులేదు. నేనే గాని వాడికి యిడ్లీ యిప్పిస్తే వీళ్ళిద్దరేకాక సర్వరు కూడా నా వేపు చిన్నచూపు చూస్తాడు. నాకూ వాడికీ సంబంధం ఏమిటి? తోటి మానవుడు. ఆకలితో వున్నాడు ...అంతే....ఆకలితో వున్న వాళ్ళందరికీ యిప్పిస్తావా అని అడిగింది నామనసు .మనసుతో మాట్లాడక వాడికి యిడ్లీ యిప్పిద్దామనుకున్నాను. కానీ మళ్ళీ యింతలో అభిమానం అడ్డు వచ్చింది.

ఇలా నాలో నేనే ఘర్షణపడుతూ వాడి వేపు రెండుసార్లు చూసాను. వాడు కూడ నావేపే చూసాడు. వాచీలో మరో నిముషం జరిగే సరికి వాడు యిటూ అటూ చూసి టేబుల్‌మీద కొస్త నా వేపుకు వంగాడు. అటువేపే చూసాను.

"టీ యిప్పిస్తారా!" అన్నాడు వాడు.

నన్నే వాడడుగు తున్నాడని నిర్ధారణ చేసుకుని హోటలు గడియారం వేపు చూస్తూ కనుబొమలు ముడిచి తల అడ్డంగా తిప్పాను.

ఇంతలో రవదోశ వచ్చేసింది. తలెత్తకుండా తినేసి లేచి వెళ్ళిపోయాను. బిల్లు యిచ్చేసి బైటపడ్డాను. నాలో ఘర్షణబైలు దేరింది. ఆలోచిస్తూనే నడుస్తున్నాను. నేను వాడికి రెండిడ్లీ యిప్పిద్దామను




కున్నాను. వాడే నన్ను టీ యిప్పించమని అడిగాడు. రెండిటి ఖరీదువాకపే....కాని ఎందుకో అభిమానం అడ్డు వచ్చింది. వాడు సన్నడగడమా? అయినా ఈ రాయల్ బెగ్గింగ్ ఏమిటి? ఎవడో ఫ్రెండ్ అడిగి నట్లు "టీ యిప్పిస్తారా" అని ఎంతదర్జాగా అడిగాడు! మళ్ళీనామనసు నోరు విప్పింది. "పోనీ ఎలాగా యిడ్లీ యిప్పిద్దామనుకున్నా వుగా....వాడు అడిగినంత మాత్రాన తలడ్డంగా తిప్పేస్తావా!" "నువ్వు నోరు మూసుకో....వాడు అడగ్గానే నేను యిప్పిస్తే మిగతా వాళ్ళంతా మా యిద్దరి వేపూ ఎగా దిగా చూడరూ....అయినా వాడు డబిలిడ్లీగాణ్ణి గానీ, చదువుల్రావు గాణ్ణిగానీ ఎందుకుకడగలేదు? నన్నే ఎందు కడగాలి?"

అంతటితో ఆవిషయం ఆలోచించడం ఆపేసి యింటికి పోదామని వెనక్కి తిరిగి వస్తున్నాను. సరిగ్గా "విజయకేఫ్" దగ్గ రకు రాగానే అక్కడేదో గొడవ జరుగు తోంది. ఆ బొమ్మిరోకి వెళ్ళాను విషయం ఏమిటో తెలుసుకోవాలనే కుతూహలంతో... హోటలు ప్రొప్రైటరు యిందాకటివాడ్ని పట్టుకు తంతున్నాడు. విషయం కను క్కుంటే తెలిసిన విషయం ఏమిటంటే హోటల్లో మస్తుగా తినేసి దర్జాగా వచ్చేస్తున్నాడు.

అవును నా మనసు నన్ను వాడికి యిప్పించకుండా ఆపింది.

వాడి మనసు వాడ్ని దొంగతిండి తిన మని పురిగొల్పింది.

రకరకాల, రంగురంగుల మనసుకల మనుషులు....